క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ



శంకర్‌కు ఆయుర్వేదం మందులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాములు దంపతులు

కందుకూరు: కందుకూరు మండల సీపీఐ కార్యదర్శి కేజీ శంకర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రిలో చికిత్స చేసి వైదులు ఇటీవల ఒక కిడ్నీని తొలగించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు దంపతులు ఆయన్ను పరామర్శించి ఆయుర్వేద మందులు అందజేశారు. పేదల పక్షాన నిలబడి ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసినా నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్‌ను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

మలిదశ ఉద్యమంలో యాదయ్యది కీలక పాత్ర

హుడాకాంప్లెక్స్: ప్రత్యేక తెలంగాణ పోరాట ఉద్యమంలో ప్రాణాలర్పించిన సిరిపురం యాదయ్య జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలని మహేశ్వరం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2010 ఫిబ్రవరి 20న ఉస్మానియా క్యాంపస్ ఎన్‌సీసీ గేటు వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ప్రాణత్యాగం చేసిన సిరిపురం యాదయ్య విగ్రహాన్ని కొత్తపేట చౌరస్తాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జయంతి, వర్ధంతి ఉత్సవాలు ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ అధికారులు గతంలో వినతిపత్రం అందజేశామని అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మధుకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడ సాయిబాలాజీ టౌన్‌షిప్ పేజ్–2 సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బీరం మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ముకుందరెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.సుకన్య, కోశాధికారి జి.రవీందర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమానికి కృషి చేస్తానని, అలాగే కాలనీ అభివృద్ధి కోసం అందరితో కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు.

వైద్యశిబిరానికి ఆదరణ



అప్పారెడ్డిపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరం

ఆమనగల్లు: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. హైదరాబాద్ కామినేని ఆస్పత్రి వైద్యులు డా.అఖిల్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, రాష్ట్ర ప్రైవేటు ఆస్పత్రుల బాధితుల సంఘం అధ్యక్షుడు జగన్‌గౌడ్, నాయకులు గోపాల్‌నాయక్, హన్మాన్‌నాయక్, సుశీల, పద్మ, యాదయ్య, రాంరెడ్డి, ముత్యాలు, డా.రాంరెడ్డి, శ్రీశైలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత



బాలేశ్వర్‌కు చెక్కు అందజేస్తున్న బీవోబీ ప్రతినిధులు

వనస్థలిపురం: బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీసు బ్రాంచి ఆబిడ్స్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం వనస్థలిపురంలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు రూ. 15 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ నిరీక్షణరావు మాట్లాడుతూ... బీవోబీ స్థాపించి 115 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సీఎస్‌ఆర్‌లో భాగంగా బ్యాంక్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి ఎల్.బాలేశ్వర్, బ్యాంక్ సిబ్బంది ఆనంద్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి ఆరోగ్య భరోసా..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు కొలతల నమోదు
- పౌష్టికాహార లోపం నివారణే లక్ష్యం
- పిల్లల పెరుగుదల కోసం పర్యవేక్షణ కార్డుల అందజేత
- శారీరక ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందజేత



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బాలమృతం ప్లస్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

మహేశ్వరం: చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో పాటు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన అదనపు ఆహారాన్ని సమకూరుస్తుంది. ప్రతి నెల బరువు, ఎత్తు కొలతలను లెక్కిస్తూ పౌష్టికాహార లోప నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఫలితంగా పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య క్రమేణా తగ్గి పోతుంది.ఒకప్పుడు ఎక్కువ మంది పిల్లలు పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడేవారు. ఆలోపం ఉన్న పిల్లల్లో ఎదుగుదల లేక ఆయాసం, నీరసం వంటి లక్షణాలతో కనిపించేవారు. దీంతో చదువులపై సైతం శ్రద్ధ చూపలేకపోయేవారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల ఎదుగుదలను నిత్యం పర్యవేక్షించడం, ఆకుకూరలు, పప్పు, కోడి గుడ్లతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతున్నారు.

పిల్లల గ్రోత్‌మానిటరింగ్‌తో తగ్గిన సమస్య..

అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధి మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్ మండలాల్లోని మొత్తం 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు –1861, బాలింతలు–1746, 0–6 చిన్నారులు–12,286 మంది ఉన్నారు. వీరిలో పోషణలోపం స్థితిలో సుమారు 1252 మంది, తీవ్ర పోషణ పరిస్థితిలో 189 మంది పిల్లలు ఉన్నారు.ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గ్రోత్‌మానిటరింగ్ చేస్తున్నారు. దీని కోసం పిల్లలకు ఎత్తు, బరువు తీయడానికి పరికరాలను కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించింది. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తన పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు తూచి వివరాలను ఐసీడీఎస్ యాప్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలి. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోతే అదనంగా పౌష్టికాహారం పిల్లలకు అందిస్తారు. ప్రభుత్వం ప్రతి నెల సరఫరా చేసే గుడ్లు, అదనపు పౌష్టికాహారం సక్రమంగా అందేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యానికి భరోసాగా నిలుస్తాయని గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు తల్లిదండ్రులు అంటున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మహేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి నెల తప్పనిసరిగా గ్రోత్‌మానిటరింగ్ నిర్వహిస్తున్నాం. కుటుంబంలో తల్లి, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అసెస్‌మెంట్ కార్డులు అందించి దాంట్లో బరువులు, ఎత్తులు, ఆరోగ్యం వివరాలను పొందుపరుస్తాం.అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించడం వల్ల పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గిస్తున్నాం. ప్రభుత్వం పిల్లల బరువును తక్కువ కాలంలో పెరిగేందుకు అన్ని రకాల ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన బాలమృతం ప్లస్‌ను అందిస్తుంది.

– షబానా,సీడీపీఓ, ఐసీడీఎస్, మహేశ్వరం

రూ.50కే.. ఐదు లక్షల ఆరోగ్య బీమా

- 'ఆయుష్మాన్ భారత్'ను వినియోగించుకోండి
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్



లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ బీమా పత్రాలను అందజేస్తున్న అందెల

బడంగ్‌పేట్: దేశ ప్రజల కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో కార్పొరేటర్ నిమ్మల సునిత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని శ్రీరాములు ప్రారంభించి మాట్లాడారు. ఆయుష్మాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని, రూ.50 చెల్లిస్తే ఈ పథకం ద్వారా ఏ ఆసుపత్రికి వెళ్లినా రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స చేస్తారని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కిసాన్‌మోర్చా నాయకులు ఏనుగు రాంరెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, జ్ఞానేశ్వర్, తోట అరవింద్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోపినాయక్

హుడాకాంప్లెక్స్: మిర్యాలగూడలో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపినాయక్ కోరారు. సోమవారం ఎల్‌బీనగర్‌లో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు లంబాడి, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ గిరిజనులకు గిరిజనబంధు అమలు చేయాలన్నారు. ధరావత్ ప్రీతి చావుకు కారకులైన యండి.సైఫ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏ.శ్రీను నాయక్, కే.దస్యనాయక్, నగేష్‌నాయక్, హర్యానాయక్, ఇ.పాండునాయక్, ఆర్.రవినాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని వెంటనే బహిరంగంగా ఉరితీయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కందడి శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ కందుకూరు నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను, కళాశాల అధికారులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో తరచూ వెలుగు చూస్తున్న ర్యాగింగ్ విష సంస్కృతిని నిషేధించేలా ప్రభుత్వం కమిటీని నియమించాలని, వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ సాధారణం అని ప్రకటించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి అనేగొని సాయికిరణ్, సంయుక్త కార్యదర్శి నీలం వంశీ, రాఘవేందర్, అనిల్‌కుమార్, శివకుమార్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి సబిత

మీర్‌పేట: ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ఎంతో భరోసా ఇస్తుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ 7వ డివిజన్ ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన అఖిల్‌ప్రసాద్ తండ్రి శ్రీనివాసచారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సిద్దాల బీరప్ప వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. సహాయనిధి నుంచి మంజూరైన రూ.95వేల చెక్కును సోమవారం మంత్రి చేతుల మీదుగా శ్రీనివాసచారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ స్వప్న



బస్సును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వప్న

బడంగ్‌పేట్: బస్సు సర్వీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బి.స్వప్న కాలనీవాసులను కోరారు. సోమవారం బడంగ్‌పేటలోని 30వ డివిజన్‌లోని సుమా ప్యారడైజ్ నుంచి బస్సు సేవలను పునః ప్రారంభించారు. సుమా ప్యారడైజ్ నుంచి కోఠి టూ పటన్‌చెరువు (రూట్ నెంబర్ 218)ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల అవసరాలను తెలుసుకుని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి బస్సు సర్వీసును పునఃప్రారంభించేలా చేశామని అన్నారు. బస్సు ఎక్కకుండా నిర్లక్ష్యం చేస్తే ఆక్యుపెన్సీ పెరగక పోవడంతో సర్వీసును రద్దు చేసే ప్రమాదం లేకపోలేదన్నారు. సుమా ప్యారడైజ్, రోమా–2, 3, 4, ద్వారకాహిల్స్, వెంకటేశ్వర కాలనీ, ప్రశాంతి ఎన్‌క్లేవ్, ఏజీఆర్ కాలనీ, లక్ష్మీదుర్గ, టెలిఫోన్ కాలనీ, లక్ష్మీనగర్, గాంధీనగర్, బడంగ్‌పేట కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాంచంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రామ్మూర్తి, రామకృష్ణ, డానియల్, రాజేష్, జగ్గనాయక్, గోవర్ధన్, శ్రీనివాస్, చంద్రకళ, అనిత, భవాని, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గూడు కల్పించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

ఆమనగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వారందరికీ భూమిని పంపిణీ చేయాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే వారికి తక్షణమే 5లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కవిత, నాయకులు కురుమయ్య, శివశంకర్, పోచయ్య, రమేశ్, నర్సింహా, లాలునాయక్, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సబ్‌డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆమనగల్లు: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు హక్కుల సాధన కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆమనగల్లు పట్టణంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు, సిబ్బంది భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సబ్ డివిజన్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు రాజీనామా చేయాలి

- పాలకుల అసమర్థత వల్లే విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు
- కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు



హస్తినాపురం చౌరస్తాలో నివాళులర్పిస్తున్న చెన్నోజు తదితరులు

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో పాలకుల అసమర్థత వల్లే విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని, వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు నైతిక బాధ్యత వహించి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యా నియంత్రణ జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మెడికో స్టూడెంట్ ప్రీతినాయక్, ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షిత మరణాలపై హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా చెన్నోజు మాట్లాడుతూ... గిరిజన విద్యార్థిని ప్రీతినాయక్ మరణానికి కారకులైన మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని, ప్రీతి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందజేసి, గ్రూప్–1 ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు అడ్వకేట్ పోలే విష్ణు, కోట్ల వాసుదేవ్, మహిళా సంఘాల నాయకురాలు పి.రాణి, లింగమ్మ, బహుజన సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దున్న బాలకృష్ణ, వినోద్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మేం ఆక్రమణలకు పాల్పడలేదు

- గోవిందాయపల్లి రైతులు
- అధికారులకు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కడ్తాల్: ఏక్వాయిపల్లి రోడ్డు నుంచి గోవిందాయపల్లి గ్రామానికి వచ్చే రోడ్డుపై ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని.. కావాలనే గ్రామానికి చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు వెంకయ్య, నర్సింహ, వెంకటయ్య, ఎల్లాగౌడ్, శేఖర్, శంకరయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 107, 108, 109లో మా తాతముత్తాతల కాలం నుంచి వ్యవసాయ పొలం ఉందని, నాటి నుంచి ఆ పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. వాస్తవానికి గ్రామప్రజలకు అవసరం ఉన్నంత మేరకు గత కొన్ని సంవత్సరాల నుంచి వాడుకుంటున్నారని రోడ్డుకు మేము ఎలాంటి ఆటంకాలు సృష్టించలేదని తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఓ వెంచర్ నిర్వాహకులతో గ్రామానికి చెందిన కొందరు రియల్ బ్రోకర్లు కుమ్మక్కై, రోడ్డు విస్తరణ చేయాలని తమను నానా ఇబ్బందులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఎంపీటీసీ లచిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, సాయిలు, ఈదయ్య, శంకరయ్య, జంగయ్య, నర్సింహగౌడ్, వెంకటయ్య, వార్డు సభ్యులు శేఖర్, జంగయ్య, జయమ్మ, రమేశ్, రైతులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వండి

- నియోజకవర్గ నిధుల సద్వినియోగంలో ఎమ్మెల్యే విఫలం
- బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం: నియోజకవర్గ నిధులను వినియోగించడంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం రాత్రి వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ కార్పొరేటర్ల విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ కేసీఆర్ ప్రభుత్వం దివాళా తీయించిందన్నారు. రిజిస్ట్రేషన్ల సమస్యపై తీసుకొచ్చిన జీవోకు మళ్లీ సవరణలు అంటున్నారని, ప్రభుత్వ పెద్దల జేబులు నింపేందుకే ఈ జీవోలని ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్న ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెప్పి, ఈ సారి ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు కొత్త రవీందర్‌గౌడ్, నూతి శ్రీనివాస్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్, రజిని పటేల్, శ్రీనివాస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కార్పొరేటర్ విజయలక్ష్మి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మీర్‌పేట: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సూచించారు. లియోకేర్ ఫౌండేషన్ సహకారంతో కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మీర్‌పేటలోని మహిళా శక్తిభవన్‌లో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ లత, వైస్ చైర్మన్ జ్యోతి, భారతి, అనురాగ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు డా.కళ్యాణి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్రంలో అధికారం మాదే

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి



వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కడ్తాల్: రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో నిర్వహించిన 'హాథ్‌సే హాథ్' జోడోయాత్ర కార్యక్రమంలో చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి గడపగడపకూ వెళ్లి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాల ద్వారా వివరించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఏఐసీసీ కార్యదర్శి రెడ్డి చల్లా వంశీచంద్‌రెడ్డి సమక్షంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు జెల్లా లింగంగౌడ్, బీజేపీ గ్రామ ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు పల్లెశివగౌడ్, మహేందర్‌గౌడ్, శివ, సామ రాంరెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు జంగయ్య, కొత్తపల్లి కృష్ణయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాములుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, సత్యం, రాములు, శ్రీను, రమేశ్, మధు, జనార్దన్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, సర్పంచ్ రాము, మాజీ సర్పంచ్ యాదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ తదితరులు ఉన్నారు.